సెంటెనరీ పైలాన్ దగ్గర వాక్‌లో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

## 'ఉస్మానియా తక్ష్ - 2024' ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 24 : ఉస్మానియా యూనివర్సిటీ 107వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా'ఉస్మానియా తక్ష్ - 2024' బుధవారం ఘనంగా ప్రారంభమైంది. వేడుకలను ముందస్తుగా ఓయూ ఇంజినీరింగ్ కళాశాల నుంచి సెంటెనరీ పైలాన్ వరకు 2కే వాక్ నిర్వహించారు. ఈ వాక్‌కు ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీ ప్రతిష్టను మరింత పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. 25న వర్సిటీలోని అన్ని విభాగాలలో ఓపెన్ హౌజ్ కార్యక్రమాలతో పాటు వివిధ రకాల పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. 26న ఠాగూర్ ఆడిటోరియంలో ఉదయం 10:30గంటలకు జరుగనున్న వేడుకలకు ముఖ్య అతిథిగా నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ విజయ్‌కుమార్ సారస్వత్, గౌరవ అతిథులుగా రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం, అమెరికాలోని ఇమేజియా కార్పొరేషన్ ఫౌండర్, సీఈవో వీణ గుండవెల్లి హాజరుకానున్నారని వివరించారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని, దీనికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ గేయ రచయిత, కవి జయరాజు హాజరవుతారని చెప్పారు. ఈ వేడుకలకు విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. పైలాన్ వద్ద విద్యార్థుల నృత్యాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, డెవలప్‌మెంట్ అండ్ యూజీసీ ఎఫైర్స్ డీన్ ప్రొఫెసర్ జి.మల్లేశం, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, డైరెక్టర్లు, డీన్లు, ప్రొఫెసర్లు, ఉద్యోగులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, అనుబంధ కళాశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### ఆర్ట్స్ కళాశాల భవన వద్ద..

ఆర్ట్స్ కళాశాల భవన అర్కిటెక్ట్ ఎర్నెస్ట్ జాస్పర్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 24: ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో 'ఉస్మానియా తక్ష్ - 2024' పేరుతో వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మధ్యప్రదేశ్ మాజీ డీజీపీ మరియ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కూడా ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ విద్యార్థినేనని అన్నారు. 1983-85 మధ్య ఎంఏ ఫిలాసఫీ చదివానని గుర్తు చేశారు. ఏడవ నిజాం మనవడు నవాబ్ మీర్ నజఫ్ అలీఖాన్ మాట్లాడుతూ తన తాత స్థాపించిన విశ్వవిద్యాలయంలో లక్షల మంది చదువుకుని జీవితంలో స్థిరపడడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల భవన వద్ద అర్కిటెక్ట్ ఎర్నెస్ట్ జాస్పర్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఇటీవల విడుదలైన సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో 82వ ర్యాంకు సాధించిన కౌశిక్, 545వ ర్యాంకు సాధించిన నరేంద్రలను ఘనంగా సన్మానించారు. డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలు సాధించిన వారిని సైతం సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యా నాయక్, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కుతాడి అర్జున్‌రావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ బీన వేణి షెఫర్డ్, ప్రొఫెసర్ కాశిం, డాక్టర్ కొండా నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ డేటా రక్షణకు పటిష్టమైన టెక్నాలజీ

డీఎస్‌సీఐ సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్‌రంజన్

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) : ప్రపంచ వ్యాప్తంగా సైబర్ దాడులు ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో డిజిటల్ డేటా రక్షణకు పటిష్టమైన టెక్నాలజీని వినియోగించి ఫైర్‌వాల్స్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్ అన్నారు. బుధవారం నగరంలో డీఎస్‌సీఐ సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సును నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న జయేశ్‌రంజన్ మాట్లాడుతూ రాష్ట్రంలో సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డిజిటల్ డేటా రక్షణకు ఉపయోగపడే లా అప్లికేషన్లను రూపొందించాలని సూచించారు. ప్రస్తుతం డిజిటల్ యుగంలో డిజిటల్ డేటా ఎంతో కీలకమైంది. దాని రక్షణకు పటిష్టమైన వ్యూహాలను రూపొందించడానికి సైబర్ నిపుణులు నిరంతరం పనిచేయాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ వెబ్‌సైట్ కోసం వీపీఏటీ పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న సీసీఓఈ బృందాన్ని జయేశ్‌రంజన్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సీఈఓ డాక్టర్ శ్రీరాం బిరుదవోలు, ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ డైరెక్టర్ రమాదేవి లంక, ఇన్‌ఫ్రా అండ్ కమ్యూనికేషన్ జాయింట్ డైరెక్టర్ వేణుప్రసాద్, డీఎస్‌సీఐ సీఈఓ వినాయక్ గాడ్‌సే, నాస్‌కాం ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ శ్రీనివాసన్, తదితరులు పాల్గొన్నారు.

## పెండ్యాల రాఘవరావు విగ్రహాన్ని.. ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టించండి

రవీంద్రభారతి, ఏప్రిల్ 24 : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సాయుధ పోరాట వీరుడు, వరంగల్ జిల్లా తొలి పార్లమెంటేరియన్ పెండ్యాల రాఘరావు కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించడంతో పాటు ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని ఆయన కుమార్తె, కవయిత్రి, రచయిత్రి పత్రికా సంపాదకులు డా.కొండపల్లి నిహారిణి విజ్ఞప్తి చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ పోరాటయోధుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పైన ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో తాము విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. త్వరలో సీఎంను కలిసి వినతి పత్రం సమర్పిస్తామని చెప్పారు. రాఘవరావు 1952 నుంచి 1957 వరకు పార్లమెంట్‌లో ప్రజావాణిని వినిపించిన ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడని తెలిపారు. 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో మహారాష్ట్రలోని జల్నా జైలు నుంచి రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు, వరంగల్ లోక్ సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఘన విజయం సాధించిన గొప్ప ప్రజానాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## పూడికతీత పనులను పరిశీలించిన దానకిశోర్

అబిడ్స్, ఏప్రిల్ 24 : నాలాల్లో పూడికతీత పనులను ఎంఏ అండ్ యూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అధికారులతో కలిసి బుధవారం పర్యవేక్షించారు. ఈఎన్‌సీ చీఫ్ జియాఉద్దీన్, ఎస్ఈ సహదేవ్ రత్నాకర్ ద్వారా నాలాల పూడికతీత పనులను అధికారులు తెలుసుకుని అనుకున్న సమయానికి పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

## బస్సొచ్చింది.. ఎక్కండెక్కండి..!

ప్రతి రోజూ జేబీఎస్ నుంచి ఉప్పల్ రింగ్ రోడ్డు మీదుగా తొర్రూరుకు ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఉప్పల్ రింగురోడ్డు వద్ద ఎర్రటి ఎండలో వేచి చూసిన ప్రయాణికులు .. ప్రతి రోజు వచ్చే సమయం కంటే బుధవారం తొర్రూరు బస్సు గంట లేటుగా రావడంతో ఒక్కసారిగా చుట్టుముట్టారు.

## ఇంటర్ ఫలితాల్లో.. హైదరాబాద్‌కు 10, 12వ స్థానం

# రంగారెడ్డి ఫస్ట్.. మేడ్చల్ సెకండ్

**- మొదటి, ద్వితీయ సంవత్సరంలో బాలికలదే పైచేయి - 24నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు**

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 ( నమస్తే తెలంగాణ ) : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటగా.. హైదరాబాద్ విద్యార్థులు నిరాశ పర్చారు. రంగారెడ్డి జిల్లా ఇంటర్ ఫస్ట్ ఇయర్ 71.7 శాతంతో ప్రథమ స్థానంలో, సెకండ్ ఇయర్ 77.63 శాతంతో తృతీయ స్థానంలో నిలిచింది. మల్కాజిగిరి జిల్లా రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్ 71.58 శాతం, సెకండ్ ఇయర్ 78.31 శాతం ఉత్తీర్ణత పొందారు. హైదరాబాద్ జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 59.91 శాతం ఉత్తీర్ణతతో పదవ స్థానంలో నిలువగా, ద్వితీయ సంవత్సరంలో 65.95 శాతం ఉత్తీర్ణతతో 12వ స్థానంలో నిలిచింది. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 1,57,667 మంది పరీక్షకు హాజరుకాగా 99,101 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ ఫలితాలు రెండింటిలోనూ బాలికలదే హవా కొనసాగింది.

## అంచనాలను మించుతున్న.. విద్యుత్ వినియోగం

పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసిన విద్యుత్ శాఖ అధికారులు

**ఒకే రోజు 85.38 మిలియన్ యూనిట్లు వినియోగం**

**విద్యుత్ శాఖ అధికారుల అంచనాలు తారుమారు**

**100 మిలియన్ యూనిట్లకు చేరువ అవుతుందేమో.?**

**కేసీఆర్ ముందుచూపుతో.. ప్రస్తుత డిమాండ్‌ను తట్టుకుంటున్న విద్యుత్ నెట్‌వర్క్**

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ పరిధిలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్నది. ఎండల తీవ్రత పెరుగుతున్న కొద్ది అన్ని రంగాల్లో విద్యుత్ వినియోగం ఎక్కువవుతున్నది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో 21 సర్కిళ్లు ఉండగా, అందులో 9 సర్కిళ్లతో కూడిన గ్రేటర్‌లోనే 60 లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. దీనికి తోడు ప్రతినెలా వేల సంఖ్యలో కొత్త విద్యుత్ కనెక్షన్లు తీసుకుంటున్నారు. ఫలితంగా విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరుగుతూనే ఉంది. గతేడాది మే నెలలో ఉన్న అత్యధిక రికార్డు స్థాయి విద్యుత్ వినియోగం ఈ ఏడాది ఏప్రిల్ 18న నమోదైంది. గతేడాది మే నెల 19న అత్యధికంగా రికార్డు స్థాయిలో 79 మిలియన్ యూనిట్లు నమోదైతే, ఏప్రిల్‌లోనే 85.38 మిలియన్ యూనిట్లు వినియోగించడం రికార్డుగా మారింది. ఈ ఏడాది వేసవిలో 85-90 మిలియన్ యూనిట్లు అంచనా వేసుకుంటే, అది ఏప్రిల్ మధ్యలోనే నమోదు కావడం విద్యుత్ శాఖ అధికారుల అంచనాలనే తారుమారు చేస్తున్నది. ఇంకా మే నెల వస్తే విద్యుత్ ఎలా ఉంటుందోనన్న ఆందోళన అధికారుల్లో మొదలైంది. ఇదే పరిస్థితి కొనసాగిస్తే విద్యుత్ వినియోగం గ్రేటర్ పరిధిలో 100 మిలియన్ యూనిట్ల వరకు చేరుకునే అవకాశం లేకపోలేదని అభిప్రాయాన్ని ఉన్నతాధికారులు వ్యక్తం చేస్తున్నారు.

### కేసీఆర్ ప్రభుత్వం ముందు చూపు..

విద్యుత్ రంగం విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో వ్యవహరించింది. తెలంగాణ రాష్ట్ర రాజధాని అయిన హైదరాబాద్ చుట్టూ రెప్పపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా ఉండేలా పవర్ ఐల్యాండ్‌ను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా రూ.14 వేల కోట్లతో సబ్ స్టేషన్లు, కొత్త లైన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతోనే ఈ స్థాయి విద్యుత్ డిమాండ్ ఉన్నా విద్యుత్ నెట్‌వర్క్ తట్టుకోగలుగుతున్నదని అధికారులు పేర్కొంటున్నారు. సాధారణంగా విద్యుత్ వినియోగం ప్రతి యేటా 10-15 శాతం ఉంటే, ఈసారి 20శాతం దాటి ఇంకా పెరిగేందుకు అవకాశం ఉంది. ఆ స్థాయిని తట్టుకునేలా గత కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్ సరఫరా నెట్ వర్క్‌ను హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఉన్న వాటి సామర్థ్యాన్ని పెంచేలా విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. వేసవి కార్యాచరణలో భాగంగా బోయిన్‌పల్లి, సుభాష్‌నగర్, గంధంగూడ, జల్‌పల్లి ప్రాంతాల్లో 12.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆయా సబ్ స్టేషన్‌లలో ఏర్పాటు చేశారు. అదేవిధంగా 8ఎంవీఏ పీటీఆర్‌లను కందికల్‌గేట్, బాచుపల్లి, నారపల్లి, నందనవనం, కోకాపేట, ఫసిఫికా, నార్సింగి, కొత్తగూడలో ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తున్నారు.

## ఆర్యవైశ్య లేడీస్ హాస్టల్ ప్రారంభం

ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య హాస్టల్‌లో బాలికల హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి టీజీ వెంకటేశ్, ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా

కవాడిగూడ, ఏప్రిల్ 24 : బాలికల హాస్టల్ పేద వైశ్య విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని మాజీ మంత్రి టీజీ వెంకటేశ్, ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. బుధవారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య హాస్టల్ భవన్‌లో వాసవీ ఆర్యవైశ్య టీజీ లక్ష్మి, వెంకటేశ్ పేరిట నూతనంగా నిర్మించిన లేడీస్ హాస్టల్‌ను వారు ప్రారంభించారు. ఉన్నత విద్యతో పాటు సివిల్స్‌లో రాణించిన పేద విద్యార్థులకు ఐవీఎఫ్ ద్వారా రూ.1లక్ష స్కాలర్ షిప్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైశ్య సంఘం, హాస్టల్ ట్రస్ట్ ప్రతినిధులు గెల్లి రమేశ్, ప్రభాకర్, సత్తయ్య, చంద్రయ మల్లికార్జున్, యాదయ్య, పీఎస్ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## 28న నాదమ్ నృత్య కార్యక్రమం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వాణీరమణ, ఆర్.చంద్రశేఖర్ తదితరులు..

చిక్కడపల్లి, ఏప్రిల్ 24 : కూచిపూడి నృత్య గురువు బృందం సిద్ధనాట్య కళా సమితి ఆధ్వర్యంలో 'నాదమ్ శ్వికన'' ఈ నెల 28న ఆదివారం నృత్యోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్ష, కార్యదర్శులు వాణీ రమణ, ఆర్.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం చిక్కడపల్లిలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. నృత్యగురువులు రేణుకాప్రభాకర్, శ్రీలత నారపరాజు, నిష్టల సుధామాల, మాధవీమాల, భరణి అడప పాల్గొన్నారు.

## సీడీఎఫ్‌డీ ఇంక్యుబేటర్‌లో మరో స్టార్టప్

సిటీబ్యూరో, ఏప్రిల్ 24(నమస్తే తెలంగాణ) : సెంటర్ ఫర్ డీఎన్ఏ అండ్ ఫింగర్‌ప్రింటింగ్ డయాగ్నోస్టిక్స్‌లోని ఇంక్యుబేషన్ సెంటర్‌లో మరో స్టార్టప్ ఏర్పాటైంది. చిన్న పిల్లలకు సోకే డెవలప్‌మెంటల్ డిస్‌ప్లేసియా ఆఫ్ ద హిప్(తుంటి కీలులో లోపం) సమస్య కారణంగా నవజాత శిశువుకు తీవ్రమైన సమస్యగా మారుతున్నది. ఈ క్రమంలో ఈ వ్యాధిని ముందుగానే డయాగ్నోస్టిక్ చేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా పనిచేసే విధానాన్ని టర్న్‌ఇట్ ఏఐ సంస్థ కృషి చేస్తున్నది. ఈ క్రమంలో నవజాత శిశువు ఆరోగ్యకరమైన పెరుగుదలను నియంత్రించే డీడీహెచ్‌ను ముందస్తుగా గుర్తించే వీలు ఉంటుందని దీని ద్వారా చికిత్స త్వరగా అందించడం వలన చిన్నారుల్లో వైకల్యాన్ని దూరం చేసేందుకు వీలు కలుగనుంది. కాగా సీడీఎఫ్‌డీలో ఏర్పాటు చేసిన టర్న్‌ఇట్ ఏఐ స్టార్టప్ వైద్యారోగ్య రంగంలో వినూత్న ఆలోచనతో రూపకల్పన చేసినట్లుగా సీడీఎఫ్‌డీ వర్గాలు పేర్కొన్నాయి.

## 1969 ఉద్యమకారుడు నాగయ్య గుండెపోటుతో మృతి



కాచిగూడ, ఏప్రిల్ 24 : 1969 తెలంగాణ ఉద్యమకారుడు టి.నాగయ్య గుండెపోటుతో మృతి చెందడం పట్ల 1969 తెలంగాణ విద్యార్థి జేఏసీ కన్వీనర్, చైర్మన్ ఎస్.గోపాల్‌రావు సంతాపం తెలిపారు. బుధవారం నింబోలిఅడ్డా కార్యాలయంలో నాగయ్యకు నివాళులర్పించారు.

## తలసేమియా నిర్మూలనకు హెచ్‌బీఏ2 పరీక్షలు తప్పనిసరి చేయాలి

**- టీఎస్‌సీఎస్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్**

సీఎంఈని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న టీఎస్‌సీఎస్ ప్రతినిధులు

అమీర్‌పేట్, ఏప్రిల్ 24 : ప్రభుత్వం సహకరిస్తే తెలంగాణను తలసేమియా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దవచ్చని టీఎస్‌సీఎస్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ పేర్కొన్నారు. 'తలసేమియా నివారణ - ఒక్క అడుగు దూరంలో' అనే అంశంపై బుధవారం అమీర్‌పేట్‌లోని హోటల్ మారీగోల్డ్‌లో టీఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో జరిగిన నిరంతర వైద్య విద్య (సీఎంఈ) సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. తలసేమియా అనేది రక్తంలో జన్యుపరమైన లోపాలతో ఏర్పడే సమస్య అని, సకాలంలో దీనిని గుర్తిస్తే పూర్తిగా నిర్మూలించే వీలుందని తెలిపారు. గర్భవతులు హెచ్‌బీఏ2 వైద్య పరీక్ష చేయించుకోవడం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం చట్టం తీసుకువస్తే ప్రజల్లో ఈ వ్యాధి పట్ల అవగాహన పెరుగుతుందన్నారు. ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి గైనకాలజిస్టులు, ప్రసూతి వైద్యులు విచ్చేసి ఈ వైద్యంలో చోటు చేసుకున్న ఆధునిక ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ అనుమతితో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామాలు, తండాలలో స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సహాయంలో గర్భవతులకు హెచ్‌బీఏ2 వైద్య పరీక్షలు నిర్వహించి, తలసేమియా విస్తరించే తీరుపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా తొలి తలసేమియా రహిత జిల్లాగా అవతరించే వీలుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌సీఎస్ ముఖ్య వైద్య పరిశోధనాధికారి డాక్టర్ సుమన్ జైన్, టీసీపోజీఎస్ అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.శాంతకుమారి, ఫెర్నాండెజ్ ఆసుపత్రి ఫాటల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ గీతా కోలార్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శ్వేతా అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## కిషన్ రెడ్డి సికింద్రాబాద్‌కు ఏం చేశావ్.?



మహంకాళి దేవాలయం వద్ద అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

బేగంపేట్, ఏప్రిల్ 24 : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నగరానికి కృష్ణ, గోదావరి జలాలు తీసుకువచ్చి ప్రజల దాహార్తిని తీర్చామని, అవుటర్ రింగ్‌రోడ్డు, ఎయిర్‌పోర్ట్, మెట్రోరైల్, ఐటీ కంపెనీలు, ఫార్మా కంపెనీలు తీసుకువచ్చారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్ నామినేషన్ కోసం బుధవారం సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని దర్శించుకొని సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్యాట్నీ సెంటర్ కార్నర్ వద్ద ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరారు. ఇప్పటి వరకు కేంద్ర మంత్రిగా ఉన్న బీజేపీ అభ్యర్థి కిషన్ రెడ్డి సికింద్రాబాద్‌కు చేసింది ఏమీ లేదన్నారు. అనంతరం దానం నాగేందర్ ర్యాలీగా వెళ్లి జీహెచ్ఎంసీ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో అంజన్‌కుమార్ యాదవ్, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో సత్తా చాటిన రెసోనెన్స్ కళాశాల

ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల డైరెక్టర్ పూర్ణచంద్రారావు

మాదాపూర్, ఏప్రిల్ 24 : తెలంగాణలో విడుదలైన ఇంటర్ మీడియట్ పరీక్షా ఫలితాల్లో రెసోనెన్స్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. మాదాపూర్‌లోని రెసోనెన్స్ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హైదరాబాద్ రెసోనెన్స్ కళాశాలల డైరెక్టర్ పూర్ణ చంద్రారావు విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ మీడియట్ పరీక్షా ఫలితాల్లో రెసోనెన్స్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడం సంతోషంగా ఉందన్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో బాలికలు అత్యుత్తమ ప్రతిభను కనబరిచినట్లు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో అత్యధిక మార్కులు 1000/982, బోటనీలో 100శాతం మార్కులు సాధించిన విద్యార్థులు 9, జువాలజీలో 100శాతం మార్కులు సాధించిన విద్యార్థులు 42, ఫిజిక్స్‌లో 100శాతం మార్కులు సాధించిన విద్యార్థులు 8, కెమిస్ట్రీలో 100శాతం మార్కులు సాధించిన విద్యార్థులు 9 మంది ఉన్నారని, ఉత్తమ మార్కులు సాధించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.

## రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 24 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు.

### ఎంఫిల్ ఇన్ రిహాబిలిటేషన్ సైకాలజీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఫిల్ ఇన్ రిహాబిలిటేషన్ సైకాలజీ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు తెలిపారు. ఎంఫిల్ ఇన్ రిహాబిలిటేషన్ సైకాలజీ (రెండేళ్ల కోర్సు) మొదటి, రెండో సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షా ఫీజును ఈ నెల 29వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.